# ఆడపిల్ల

[ఆంధ్రభూమి 1984]

---

తల్లి కొడుకు ఇంట్లోనే వుండడం అది మన సంప్రదాయం దాన్ని తుచా తప్పకుండా పాటించడం అది మన మౌఢ్యం.

—జయప్రద

---

నీరసంగా పేము కుర్చీలో వెనక్కు వాలి చేతిలోని కొడుకు ప్రోగ్రెస్ కార్డు వంక దిగులుగా చూసుకుంటున్న జోతిర్మయి ముఖం తన వాకిట్లో కడుగుబెట్టిన వ్యక్తిని చూసి వికసించింది....వాడిపోయిన పువ్వు మీద తుషార బిందువులు రాలితే కొంతలో కొంత నవనవ లాడినట్టుగా.

'రండి మాష్టారూ!' ఆమె లేచి అతనికెదురెళ్ళింది. 'బాగున్నావామ్మా' అనబోయిన అతని పెదాలు ఆగిపోయినాయి.

'ఏమ్మా! అలా వున్నావు?' తన ఒకనాటి శిష్యురాలి వంక విశితంగా చూస్తూ అడిగాడు.

ఆ అడగడంలో ఆత్రుత వుంది, అభిమానం వుంది. అది కేవలం పలకరింపు కాదు.

వెంటనే తన చేతిలో ప్రోగ్రెస్ కార్డు అతని చేతిలో వుంచేసింది. అతని దగ్గర ఆమె కిలాంటి విషయాల్లో ఏ దాపరికమూ లేదు. అతను ఆమెకు గురువే కాదు తండ్రి అంతటి వాడు. అంతటి ఆత్మీయతను పంచినవాడు.

అతను అలా నిల్చునే ప్రోగ్రెస్ కార్డులోని మార్కులవంక ఐదు నిముషాలు చూసాడు. నూటికి అన్నిటిలోనూ మార్కులు ఒకే అంకెలో వున్నాయి.

'కూర్చోండి మాస్టారూ!'

అతని కది శరీరక అలసటో, మానసిక అలసటో ఇంక ఒక్క క్షణం కూడా నిల్చోలేనట్టు చప్పున అక్కడున్న పేము కుర్చీలో కూర్చుని వెనక్కి వాలిపోయాడు

'కాఫీ తెస్తానుండండి అనసిపోయినట్టున్నారు నడిచొచ్చారా?'

అతనేం జవాబు చెప్పలేదు.

ఆమె లోపలికెళ్ళిపోయింది.

శ్రీరామ్ మాస్టారు ఆమె చదివిన కాన్వెంట్‌లో తెలుగు మాస్టారు టెన్త్ క్లాసు వరకు 'ప్రతి క్లాసులో ప్రతి సబ్జెక్ట్‌లో ఆమెకు ఎంత స్ట్రిక్ట్‌గా దిద్దినా నూటికి యనభై తొంభై మార్కులు వచ్చేవి. జ్యోతి ర్మయి భర్త కూడా తెలివిగలవాడే-మరి ఈ బాబుకు తన తల్లి గుండెల్లో రగిల్చే ఈ మార్కులేవిటి?' ఎక్కడ జరుగుతోంది అలక్ష్యం?

* * * *

చేతిలో ఒక కాఫీ కప్పుతో వాకిట్లో కొచ్చిన జ్యోతి ఆగిపోయింది.

తన మాస్టారి కుర్చీ ప్రక్కన స్టూల్ మీద మరో యువకుడు-మరలా వెనక్కెళ్ళి మరో కప్పు కాఫీ తీసుకుని అయిదు నిముషాల్లో వచ్చి కూర్చుంది.

తనవైపు పలకరింపుగా చూసి కొద్దిగా నవ్విన ఆ యువకుడిని ఎక్కడో చూసినట్లే వుంది కానీ గుర్తు రావడం లేదు. గుర్తు చేసుకోడానికి ఆమె మేధస్సు ప్రసవవేదన పడుతోంది.

'నిన్ను చూడాలని వీడూ నాతోనే బయలుదేరాడమ్మా....ఏరా ఎక్కడాగిపోయావ్?'

నా మేధస్సు ప్రసవించింది. ఇతను మాస్టారి కొడుకు వేణుగోపాల్ కదూ!

'మధ్యలో మన వాసు కనిపిస్తే ఆగిపోయాను నాన్నా.'

'వేణు ఎంత పెద్దవాడయి పోయాడు!'

తన ఆశ్చర్యానికి తనకే నవ్వొచ్చింది. ఇరవై ఏళ్ళ తర్వాత ఎవరయిన పెద్దవాళ్ళయిపోరూ!

అతన్ని ఎప్పుడు చూసిందని తను!

నిక్కర్లు వేస్తుండగా చూడ్డమే!

ప్రక్క పన్ను మీద పన్ను ఆ అందమైన నవ్వు-అతను తనకు తెలిసిన వ్యక్తిగా అనిపించింది కానీ లేకపోతే యువకుడిగా మారిపోయిన తన బాల్యస్నేహితుడు. అసలు పరిచితుడిగా అన్పించేవాడా!

"ఏంటమ్మా....మీ క్లాస్‌మేట్....వేణు...."

"గుర్తుంది మాస్టారూ! పెద్దవాడయి పోయాడు కదూ! అదే చూస్తున్నాను."

ఆయన కాస్త పెద్దగా నవ్వితే-వేణుగోపాల్ వినిపించీ విన్పించనట్టు మెల్లిగా నవ్వాడు.

"మీరు నన్ను కాస్త ఆలస్యంగానయినా గుర్తుపట్టారు. మిమ్మల్ని నేను మీ ఇంట్లో చూసాను కనుక గుర్తుపట్ట గలిగాను. మరో దగ్గరయితే గుర్తు పట్టలేక పోయేవాణ్ని" అని మరలా చిరునవ్వు నవ్వాడు వేణు.

ఆమె ఆలోచనలు ఇరవై ఏళ్ళ వెనక్కి వెళ్ళిపోతున్నాయి. ఆ అందమైన బాల్యంలోకి జారుకుంటున్నాయి.

ఎంతటి వాడినయినా నువ్వు నువ్వు అనుకునే ఆత్మీయతలోకి జారిపోతున్నాయి. ఆ వాగు, ఆ కోవెల అక్కడ తమ ఆటలు, అల కలు....

"ఏమిటమ్మా! ఈరోజు ఇలా వున్నావు నువ్వు?"

ఉలిక్కిపడింది జ్యోతి.

"ఏం లేదు మాస్టారూ! మీరు కాఫీ తీసుకోండి."

"బావున్నారా?" బహువచనప్రయోగమే అయినా ఆ అడగడంలో వేణు కంఠంలో ఆత్మీయత గుర్తించిన జ్యోతి కాస్త చలించింది బాగున్నా నన్నట్టు తలాడించింది.

"ఎందుకని? ఎందుకని? ఈ మధ్య తనకు తరచుగా తన బాల్యం, తను చదివిన స్కూలు ఆ చిన్న జీవితం గుర్తుకొస్తోంది? ఎందుకని మరొక్కసారి వెనక్కు తిరిగి జీవితంలో వెళ్ళిపోవాలని పిస్తోంది?"

నిజానికి ఇప్పుడు తనకున్న జీవితం ఏమీ తక్కువదేం కాదు. అపురూపంగ చూసుకునే భర్త, తల్లిలా ఆదరించే అత్త, ఇంకా తన మాట వింటున్న కొడుకు అయినా ఏమిటో ఆ జీవితమే కావాలనిపిం చడం?

"జ్యోతీ! నేను రేపొస్తానమ్మా వీడు నిన్ను చూడాలంటే తీసు కొచ్చాను కాస్త పనుంది" అంటూ లేచి నిలబడ్డ మాస్టారి వంక దిగులుగా చూసింది.

జ్యోతి తన కొడుకు చదువు విషయం ఈరోజు మాస్టారుతో చర్చించి వాడినెలాగయినా బాగుచేసుకోవాలనే తీవ్రమయిన కోరిక ఆయన్ని హాకిట్లో చూడగానే అనిపించింది. కానీ ఆయన వెళ్ళిపోతా నంటున్నారు.

తన శిష్యురాలి ముఖంలో దిగులు ఆయన కంటి చూపును దాటి పోలేదు కానీ తన కొడుకు ముందు ఆమె కొడుకు అజ్ఞానాన్ని చర్చిం చడం ఆమెను చిన్నపర్చడ మవుతుందని ఆయన ఆలోచన.

వేణుగోపాల్ చేతులు జోడించాడు శెలవు తీసుకుంటానన్నట్టుగా.

"మీరు నన్ను గుర్తుపెట్టుకుని నన్ను చూడాలని రావడం నాకు చాలా సంతోషంగా వుంది" ఒకరకమైన భావావేశంతో ఆమె కంఠం కొద్దిగా వణికింది.

"మనం కలుసుకొన్న కాలం చిన్నది కాదనుకోండి అయినా మన పసితనం, మన స్నేహం కూడా చిన్నది కాదు కదా!"

జోతిర్మయి సన్నగా నవ్వింది కానీ అంతర్గతంగ ఆమె శరీరములో ప్రతి రక్తనాళాల్లోనూ వాళ్ళ తియ్యటి బాల్యం పరవశిస్తూ పొంగింది-దాని తాలూకు అనుభూతి ఆమె శరీరాన్ని కూడా కొద్దిగా వణికించింది.

"ఆ రోజుల్లోలా ఈ రోజుల్లో పిల్లలకు అంతటి అపురూపమైన స్నేహితులు లేరేం! ఎంత సేపటికీ తల్లి కొంగు, సినిమాలు, టి.వి.లు తప్ప.

"వస్తామండీ. బాంబే కొకసారి రండి. మా శ్రీమతికి కూడా నా ద్వారా మీరు తెల్సు"

"పిల్లలా?"

"ఈ మధ్యనే మ్యారేజయింది. మీ బాబేడీ?"

వెళ్ళడానికి లేచిన వాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. మాస్టారు ముచ్చటగా వాళ్ళను చూస్తున్నారు. "ఈ అమ్మాయి అంటే తనకెందుకింతిష్టమో!" ఆత్మావలోకం చేసుకుంటున్నారాయన-

"బహుశా తను కొత్తగా టీచర్‌గా ఆ ఊరికి వచ్చిన రోజుల్లో ఎదురయిన తెలివయిన మొదటి స్టూడెంట్‌గా ఆమె తన మనస్సులో నిల్చిపోవడమే అయ్యుంటుంది" అని సమాధానం చెప్పుకుంటున్నాడు.

* * * *

ఖాళీ డాబా మీదకు వెళ్ళబోతూ మెట్లెక్కుతున్న జ్యోతిర్మయి కాళ్ళు ఆగిపోయాయి.

కథా నిలయం 38249 శ్రీకాకుళం

మెట్లకు ఓ ప్రక్కగా పుస్తకాలు పరిచి హోంవర్క్ చేయమని అన్నీ సర్ది ఇచ్చి వెళ్ళినవి సర్దిచ్చినట్లే వున్నాయి.

మైసూరు పాక్‌ల పళ్ళెం మాత్రం కొత్తగా చేరుకుంది.

ఏడోక్లాసు చదువుతున్న తన పన్నెండేళ్ళ కొడుకు మైసూర్ పాక్ తింటూ పెన్ నిబ్‌ని క్రింద బాదుతున్నాడు.

జ్యోతిర్మయి గుండెల్లో దిగులు చిక్కబడింది.

వీడు బాగుపడే దెప్పుడు? బాధ్యత తెలిసేదెప్పుడు? వాడి మార్కుల తాలూకు దిగులు, విరక్తి, చికాకు ఇవన్నీ కలిసి ఆమెను పిచ్చిదాన్ని చేసాయి.

ఎక్కిన రెండు మెట్లు దిగేసి చేతికందిన స్కేలుతో దబదబా బాదేసింది.

"అయ్యో! అయ్యో! వాడిని చంపేస్తున్నావా ఏవిటి?" కోడలి వైపు కోపంగా చూస్తూ స్కేలు తీసుకుంది పార్వతమ్మ.

"మీరూరొక్కండి మీకు తెలీదు. వీడి మార్కులు....వీడి మార్కులు చూసాక ఇలా వదిలేస్తే వీడికి చదువురాదు. అడుక్కు తింటాడు."

"ఓయబ్బో! పెద్ద చదువులు చదువుకోకపోతే అడుక్కు-తింటాడా? మీ మామయ్య, మీ నాన్న అంతా తెగ చదివేసారా?రారా.... నాన్నా....పాపం చూడు ఒళ్ళెలా హూనం అయిందో! అయినా అమ్మాయీ నీకు గుండెలేదు సగం మైసూర్‌పాక్ అన్నా తినలేదు బిడ్డ."

జ్యోతిర్మయి చలనం కూడా ఆగిపోయింది. కొడుకు అత్తెసురు మార్కుల బాధ, తను కొడుకుని కొట్టుకున్న బాధ, పెద్దదయిన అత్త గారిని ఏమీ అనలేని నిస్సహాయత-

కొడుకు ఏడుపుతో స్పృహ వచ్చింది జ్యోతిర్మయికి కానీ ఆమె గుండెల్లో మరింత బరువు, నిదానంగా, భారంగా మెట్లు ఎక్కుతోంది..

తన వెనక తన బాధను మరింత పెంచేలా "నేను చచ్చిపోతాను నాన్నమ్మా!" అని ఏడుస్తున్నాడు ఆమె ఏకైక కొడుకు నూతన్.

"ఒరే, ఒరే అట్లా అనకురా తండ్రీ నువ్వు తప్ప నాకింకెవరున్నారు రా కన్నా"

జ్యోతిర్మయిలో దిగ్భ్రాంతి.

"ఏమంటోంది అత్తగారు! తనకు వీడు తప్ప ఎవరూ లేరంటోందా? ముగ్గురు పిల్లల తల్లి ఆమె. ఆమె కడుపు చల్లగా అందరూ బ్రతికే వున్న అదృష్టవంతురాలామె.

ఇద్దరు అల్లుళ్ళు కూడా ఆమెను బాగానే చూస్తున్నారు. ఆ పిల్లలకు నలుగురు మనుమరాళ్ళున్నా ఆమె గుండెల్లో ఎవరూ లేని దానిలా వంటరితనం ఫీల్ అవుతోందా?

నూతన్ తప్ప ఎవరూ ఆమెకు లేరా?

ఆమె వెనుక నూతన్ వెక్కిళ్ళు పెడుతున్నాడు. పార్వతమ్మ వాడిని ఒళ్ళోకి లాక్కుని బుజ్జగిస్తోంది.

"మీ అమ్మ అంతేలేరా నాన్నా నేనున్నాగా నీకు ఏడవకమ్మా. వెధవ చదువు లేకపోతే లేకపోయిందిలే నాదగ్గరున్న నగలన్నీ నీకే యిస్తాను ఏడవకూడదు మరి."

జ్యోతిర్మయి గుండెల్లో అత్తగారిపట్ల తాత్కాలికంగా జుగుప్స- "అదేనా పసివాడినోదార్చాల్సిన తీరు?"

★ ★ ★ ★

ఆ సాయంత్రం భర్త ఆఫీసునుండి వస్తూనే కొడుకు ప్రోగ్రెస్ కార్డు అతని చేతిలో పెట్టింది జ్యోతిర్మయి.

ఆ కార్డువంక రెండు నిముషాలు తదేకంగా చూసి నిట్టూర్చి తలెత్తాడు వంశీధర్.

"ట్యూషన్ మాస్టారుకి చూపించు" ఆ కంఠంలో నిస్సహాయత ఆ నిస్సహాయత తాలూకు కోపం.

"ఆయన మాత్రం ఏం చేస్తారు? ఆయన మాటవింటే కదా!" నిష్టూరంగా అంది జ్యోతిర్మయి.

ఆ నిష్టూరం కొడుకు మీద కాదు తన దురదృష్టం మీద.

"నాకెలాగూ తీరడం లేదు. నువ్వయినా కాస్త దగ్గర పెట్టుకుని చెప్పకూడదూ?"

"అంతకంటే మించిన ఘనకార్యాలు నేనేం చేస్తున్నాను కనుక?"

అతడు దీర్ఘంగా చూసాడు. తనని తాను నిగ్రహించుకుంటూ అన్నాను.

"రోజూ రెండు గంటలు వాడిని కూర్చోబెట్టుకుని చదివించు జ్యోతి! ఓ డిగ్రీ అన్నా లేకపోతే ఈ రోజుల్లో విలువలేదు. పైగా నా సంపాదనతో వాడికి నేనేమీ మిగల్చలేను. వాడికో డిగ్రీ వచ్చి, ఉద్యోగము వస్తేనే బ్రతుకు."

"ఆ సంగతి మీ అమ్మకు చెప్పండి" విసురుగా అంది జ్యోతిర్మయి.

విసుగ్గా చూసాడు వంశీధర్.

ప్రొద్దుటనుండీ ఆమె ఆలోచిస్తోంది. "తన కొడుకు బాగా చదివి రేప్రొద్దున పెద్ద ఉద్యోగం చేసి తనని పోషించడేమో!" అనే బెంగతో ఆలోచించడం లేదు.

వాడికి చదువు రాకపోతే వాడి భవిష్యత్తు పాడవుతుందనే వేద నతో ఆలోచిస్తోంది.... అదీ తల్లి.

ఏదో అనబోయి ఆగాడు వంశీధర్.

కాస్సేపు సాలోచనగా చూసాడు.

"బాధపడకు. నూతన్‌ని హాస్టల్‌లో చేర్పిస్తాను."

వంశీధర వూహించినట్టు జ్యోతిర్మయి ఆనందించలేదు, సంతృప్తి పడలేదు.

"ఆ ఊహ నాకెప్పుడో వచ్చింది. కానీ చదివే బిడ్డలకు, చెప్తే వినే బిడ్డలకే హాస్టల్ చదువులు. ప్రైవేట్ మాష్టారు పాపం సామదాన దండోపాయాలు ప్రయోగిస్తుంటేనే వాడి బుర్రకెక్కడం లేదు. ఇక హాస్టల్‌లో అంత పర్సనల్ అటెన్షన్ ఎవరు తీసుకుంటారు?" దిగులుగా చూసింది జ్యోతిర్మయి.

"ఏదో ఒకటి చూద్దాంలే దిగులుపడకు. నాకు వేడిగా టీ తెచ్చి పెట్టు" అని టాపిక్ మార్చాడు వంశీధర్.

"ఏది ఎలా చూడాలో అతనికి తెలీదు. నిజానికి హాస్టల్‌లో పెట్టి చదివించే స్తోమతు తనకు లేదు. అయినా దానికి సిద్ధపడ్డాడు. ఇప్పుడు మరేదో తనేం చేయగలడు?

* * * *

ఆ రాత్రి ఆలోచించి ఆలోచించి జాగారం చేసిన ఆమె కళ్ళు మంకెన పువ్వుల్లా వున్నాయి.

ఆ ఉదయం టిఫిన్ అన్నా చేయకుండా హాల్లో వున్న ఒక చిన్న ఈజీచెయిర్‌లో వెనక్కి వాలి పడుకోనున్న జ్యోతిర్మయి ఉలిక్కి పడి కళ్ళు తెరిచింది.

ఎదురుగా శ్రీరామ్ మాష్టారు ఆమె ఎర్ర కళ్ళల్లో ఒక కాంతి రేఖ, ఆమె లేచి గోడ ప్రక్కనున్న స్టూల్ మీద కూర్చుంది.

మాష్టారు ఈజీ చెయిర్‌లో కూర్చుని తన స్టూడెంట్ కళ్ళల్లోకి చూశాడు.

"చూడమ్మా జ్యోతీ! నూతన్ మారతాడు."

"బాధపడకు నేను నూతన్ ట్యూషన్ మాష్టార్‌కి చెప్తాలే."

"ఏం ట్యూషన్ మాస్టర్లో ఆరోజుల్లోలా కాదు మాష్టారూ కేవలం జీతంకోసం వస్తున్నారు."

శ్రీరామ్ మాష్టారు మనసులో నవ్వుకున్నాడు

"వాళ్ళననకమ్మా ఈ రోజుల్లో పిల్లల్లో గురు భక్తి తగ్గిపోయింది."

జ్యోతిర్మయి మాట్లాడలేదు.

తన శిష్యురాలి మౌనం అతన్ని పశ్చాత్తాపంలోకి తోసింది. పాపం అసలే కొడుకు మార్కులు చూసి బాధపడుతున్న ఆమెను తను మరీ బాధపెట్టాడు.

"మన నూతన్ విషయం కాదమ్మా నేను జనరల్‌గా చెప్పానంతే" అలా అనేసిన ఆయన నూతన్‌లో మార్పు తేవడానికి ఏమి చేయాలా అన్నట్టుగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నేను ట్యూషన్ మాష్టార్ని అనడం కూడా మీరన్నట్టు అన్యాయమే మాష్టారూ! వాళ్ళు మటుకేం చేయగలరు! వాడితోపాటు మా అత్తగారు కూడా కూర్చుంటారాయె వాళ్ళకేం స్వేచ్ఛ వుంటుంది!"

"నువ్వు చెప్పకపోయావామ్మా! పోనీ వారయినా.... అలా కూర్చోవద్దని ఆమెతో చెప్తే...."

"ఉహూ లాభం లేకపోయింది మాష్టారూ! ఆయనా చెప్పారు నేనూ చెప్పాను ఆమె మా మీద అలిగేదే కానీ కూర్చోవడం మానేది కాదు."

"ఎందుకలా చేసేవారామె? అడక్కపోయారా?"

"నూతన్‌ని మాష్టార్లు కొడతారట. వాడి ముందే చెప్పేది."

"అప్పుడిక తగువు వస్తే వచ్చిందని నేను అడపాదడపా అనే దాన్ని మీవల్లే వాడికి చదువు రావడం లేదని"

మాష్టారు కళ్ళెత్తి చూసి మరలా ఆలోచనలో పడిపోయారు.

"అలా అన్నప్పుడు మాత్రం చదువుకోరా వెధవా? అని చిన్నగా ఒక్క దెబ్బవేసి మరో మూడు నిమషాల్లో తన్నుతాను శపించుకుంటూ—నా చేతులు పడిపోనూ, నా నోరు పడిపోనూ పసిబిడ్డ....ఎంత పని చేసానూ! అని....వాడి పుస్తకాలు ప్రక్కన పెట్టి వాడిని దొక్కల్లోకి కుక్కుంటుంది-మీరు చెప్పండి మాష్టారూ వాడికేం తక్కువ వయస్సుందా అప్పుడే పన్నెండేళ్ళు....ఇంకా ఆమెకు వాడు ఐదేళ్ళ బిడ్డ"

మాష్టారు తలెత్తాడు.

"మీ అత్తయ్యకు నూతన్ అంటే చాలా యిష్టంలాగుంది."

"ఇష్టమే....ఎందుకా ఇష్టం నా ప్రాణం తీయడానికి కాకపోతే, వాడి భవిష్యత్తు పాడు చేయడానికి కాకపోతే...." దిగులుగా గోడకు చారగిలి పడింది జ్యోతిర్మయి.

ఆయన మరలా మాట్లాడలేదు.

"ఆమెకు వాడంటే ఇష్టం లేకపోతే, వాడిని పాడుచేయడానికివన్నీ చేస్తోందంటే ఎప్పుడో చెడ్డపేరు వస్తే వచ్చిందని వాడిని ఆమెకు దూరం చేసుందును మాష్టారూ."

"ఆఁ.....ఆఁ.....ఇప్పుడు నువ్వు చేయాల్సింది అదేనమ్మా."

తృప్తిపడ్డట్టుగా చూసింది జ్యోతి.

"ఆమెను దూరం చేసుకోవడమా?...."

ఆమె గుండెల్లో దిగులు, ఆమె అంటే జ్యోతిర్మయికి చాలా ప్రేమ-

జ్యోతిని ఆమె ఎప్పుడూ కోడల్ని చూసినట్టు చూడదు కూతుర్ని చూసినట్టే చూస్తుంది.

"కానీ నానీ భవిష్యత్తు?"....

"నూతన్ ఒక్కడే అనుకుంటూ ఆమెతో బావుండేది...." సాలోచనగా చూస్తూ అడిగారాయన.

"అదేం కాదు మాష్టారూ! కొడుకు లందరికీ ప్రేమ ఆమంటే"

"ఆహా అదికాదమ్మా ప్రేమ సంగతి కాదు నేననేది ఎక్కువ స్నేహంగా ...అదీ ఎక్కువగా ఆమెతో మాట్లాడుతూ...."

"కొడుకులకు అదెలా వీలవుతుంది మాష్టారూ! ఎవరి ఉద్యోగాలు వాళ్ళవి నాకా ఇంటిపనితో సరిపోతుంది. ఇక ఆవిడతో మాట్లాడితే నూతన్ విషయం మాట్లాడాల్సి వస్తుంది అందుకని నేనూ ఆమెతో అంతగా మాట్లాడను."

"అదీ—అదేనమ్మా నేననేది మీ అత్తగారు వాంఛించే మాట తోడు, తనే కావాలని కోరుకునే మనిషి, మీ మామగారి తర్వాత నూతన్ ఒక్కడే మీరందరూ మీ జీవితాలతో ఎదురీదుతూ ఆమెను మీకు తెలియకుండానే కాస్త దూరంగా పెట్టారు.

మా అమ్మ లేందే నేను బ్రతకలేననే భావం ఆమె పిల్లల్లో ఎవరూ వ్యక్తం చేస్తున్నట్టులేరు.

ఆమెను అల్లుకుపోయి ఆమె మీద ఆధారపడి బ్రతికే ప్రాణి నూతన్ ఒక్కడే అవునా?"

అవునన్నట్టు తలూపింది జ్యోతిర్మయి.

"అందుకే....అందుకే ఆమె అలా చేస్తుంది."

"అదేంటి వాడిని ఆమె దగ్గరగా వుంచుకోడానికి వాడి చదువు పాడుచేస్తే....ఒక్కసారి ఏమిచేయాలో తోచదు మాష్టారూ! వారాని కొక్కసారన్నా వాడికి తలనొప్పని సాకు చెప్పి బడి మాన్పించి తన ఒళ్ళో కూర్చోబెట్టుకుని కథలు చెపుతుంటుంది.

మీరే చెప్పండి మాష్టారూ మన మధ్య తరగతి కుటుంబాల్లో మనకొచ్చే జీతాల్తో-మనమేం మిగిల్చి వాడికివ్వగలం? వాళ్ళ నాన్న చదువు మా సంసారాన్ని ఈదుతున్నట్లే వాడు నాలుగు ముక్కలు చదువు కుంటే మా తదనంతరం వాడూ అమ్మా! అయ్యా! అని ఎవరి దగ్గర చెయ్యిచాపకుండా గడిపేయగలడు గానీ...." ఆమె గొంతు బొంగురు పోయింది.

తన్నుకొస్తున్న ఏడుపును ఆపుకునే ఉద్దేశంలో యింక మాట్లాడ్డం ఆపేసింది.

ఆయన జ్యోతిర్మయి వంక జాలిగా చూసాడు. ఓ ఐదునిమిషాలు తర్వాత జోతిర్మయి తేరుకున్నాక అన్నాడు.

"నువ్వు పొరబడుతున్నావమ్మా! వాడిని తనతోనే వుంచుకోవాలనీ వాడిని చెడిపేయాలనీ ఆమె ఉద్దేశ్యం కాదు-వార్ధక్యంలో వచ్చే స్వార్థం మీ అత్తగారిలో ఓ పాలు ఎక్కువ వుందంతే"

తడి కనురెప్పలెత్తి చెప్పండన్నట్టుగా చూసింది జ్యోతిర్మయి.

"మనకందరికీ కావల్సిందేమిటో చెప్పగలవమ్మా!"

జ్యోతిర్మయి మాట్లాడలేదు.

"నీకూ తెల్సు ఒకపూట అన్నం లేకపోయినా బ్రతగ్గలం కానీ

ఏ ఒక్క మనిషి ప్రేమయినా లేకపోతే బ్రతకలేం-చిన్న వయసులో మనం గుర్తించంగానీ మన అంతరాత్మకు తెలుసు.

మనల్ని తల్లిదండ్రులు ప్రేమిస్తున్నారని ఆ ధైర్యంతో మొండి కేస్తాం, అలుగుతాం. అయినా మనకి తెలుసు ఆ ప్రేమ మనకు దూరం కాదని, పెళ్ళయ్యాక భర్త, ఆ తర్వాత పిల్లలు-మనకి తెలియకుండానే మనం అందుకునే ప్రేమను కాపాడుకోవాలనే ధ్యాస లేకుండానే ఆ ప్రేమలో మునిగి కాలాన్ని నెట్టేస్తున్నాం-వింటున్నావా?"

వింటున్నానన్నట్టు కనురెప్పలయినా ఆర్పకుండా చూసింది జ్యోతి.

"తీరా పిల్లలు పెద్దవాళ్ళయి పోయాక వాళ్ళకంటూ సంసారాలు ఏర్పడ్డాక, తోడయిన భర్తగానీ, భార్యగానీ చనిపోయాక వాళ్ళు ఒంటరిగా మిగిలిపోతారు. చుట్టూ ఎంతమంది వున్నా ఒంటరితనాన్ని ఫీలౌతారు అలాటి సమయంలోనే మనవలకు, మనవరాండ్లకు దగ్గర అయిపోతారు.

తల్లి తిట్టినా కొట్టినా అమ్మ కొంగుపట్టుకుని పదలరు. తల్లి బిడ్డలను ప్రేమిస్తుందనే సత్యం ఆ చిన్న గుండెలకు కూడా తెలుసు కానీ మిగతావాళ్ళు కొట్టినా తిట్టినా వాళ్ళ చిన్నగుండెల్లో వాళ్ళ ప్రేమపట్ల అనుమానం వస్తుంది.

అందుకే నాన్నమ్మలు, అమ్మమ్మలు వీలయినంత వరకు తన మనుమల ప్రేమను భద్రం చేసుకోవటానికి ప్రయత్నాలు చేసుకుంటారు అలాటి ప్రయత్నమే ఇప్పుడు మీ అత్తయ్య చేస్తున్నది.

తనని అల్లుకుపోయే నూతన్ ప్రేమనుండి ఆమెకి దూరంకావడం ఇష్టంలేక వాడిని తన పరిధిలోకి లాక్కునే ప్రయత్నమే ఇప్పుడు ఆమె చేస్తున్నది"

మాస్టారు చెప్పే మాటలను జీర్ణం చేసుకుంటోంది జ్యోతిర్మయి.

* * * *

"సమీర వచ్చింది జ్యోతీ" అంటూ సంతోషంగా వచ్చి ఎనిమిది అయినా నిద్రలేవని కోడల్ని చూసి ప్రక్కనే కూర్చుంది పార్వతమ్మ.

"ఏమ్మా! ఒంట్లో బాగాలేదా?"

"అవునత్తయ్యా రాత్రిళ్ళు నిద్రపట్టడంలేదు పదండి" దుప్పటి లాగేసి లేవబోయిన కోడల్ని వారించిందామె.

"వద్దు....వద్దు....పడుకో సమీర ఇక్కడికే వస్తుందిలే"

సమీర ఆ ఇంటి పెద్ద ఆడపడుచు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయికి పెళ్ళయిపోయింది. రెండో పాప పెళ్ళికెదిగింది.

"వద్దులెండి నాకు నిద్రపట్టలేదంతే! ఇప్పుడేకన్నంటాను నలతేమీ లేదు" అని లేచి కూర్చుంది జ్యోతిర్మయి.

"రాకరాక తన ఆడబిడ్డ వస్తే తను ఎదురు వెళ్ళాలిగానీ ఆమె తన దగ్గరకు రావడమేమిటి?" అనే సాంప్రదాయాన్ని అనుసరించే వ్యక్తి జ్యోతిర్మయి.

అలాటి సాంప్రదాయాన్ని గౌరవించడంలో తప్పేంలేదు.

"అమ్మ చెప్పింది జ్యోతి! నీకు నిద్రపట్టటం లేదట ఎందుకని? ఆరోగ్యం బాగాలేదా?" అంది సమీర జ్యోతిర్మయి కుశల ప్రశ్నలు వేయడం అయ్యాక.

నిజం చెప్పేసింది జ్యోతిర్మయి. ఆమెకా స్వతంత్రం సమీర దగ్గరుంది.

"అలాగా! అయితే అమ్మను నేను తీసుకెళతాలే" అని హామీ ఇచ్చింది సమీర.

ఆ భరోసా జ్యోతిర్మయికి కొండంత బలాన్నిచ్చింది.

* * * *

కళ్ళజోడు పెట్టుకుని చాటలో బియ్యం ఏరుతున్న తల్లి దగ్గరకు వచ్చింది సమీర.

"నువ్విక్కడెందుకు? పాపం జ్యోతికి ఒంటిలో బాగున్నట్టులేదు. ఇద్దరూ గదిలోకెళ్ళి కూర్చోండి నేను చిటికెలో వంటచేసి వస్తాను"

"కాదులేమ్మా నీతోనే మాట్లాడాలి"

"నాతోనా?" ఆశ్చర్యంగా చూసింగి పార్వతమ్మ.

ఆ ఇంట్లో ఎవరి మధ్యా రహస్యాలుండవు.

ఆ ఇంటిలో అందరూ ఒకరికొకరు స్నేహితులే.

"అమ్మా! నేను ఒంటరిగా చేసుకోలేకుండా వున్నాను. నువ్వు నాతో రావాలి"

తల్లి మనస్థత్వం తెల్సిన సమీర ఆ రూట్‌లో వచ్చింది.

కూతుళ్ళ ఇళ్ళల్లో వుండకూడదు. కొడుకిల్లే తనిల్లు అనే సాంప్రదాయాన్ని జీర్ణించుకున్న సగటు మనిషి ఆమె.

"ఇప్పుడెలా వచ్చేదే! పాపం జ్యోతికి బాగాలేదు"

"రెండు రోజులుండి జ్యోతికి బాగయ్యాకే వెళదాంలేమ్మా"

"నూతన్ లేకపోతే నాకు తోచదే!"

"నా పిల్లలు లేరామ్మా!" కావాలనే నిష్టూరంగా అంది సమీర.

"ఆడపిల్లల మీద భ్రాంతి పెంచుకోకూడదే! వాళ్ళనొక అయ్య చేతిలో పెట్టాక బాధపడాల్సి వస్తుంది"

ఆడపిల్లలకు పెళ్ళిచేస్తే వాళ్ళు మనవాళ్ళు కాదనే జీర్ణ సాంప్రదాయాన్ని జీర్ణించుకుని చెప్పిందామె.

కొత్త సంగతి విన్నట్టు చూసింది సమీర.

"తన కూతురికి పెళ్ళయింది. కానీ తన అల్లుడు మంచివాడు. తన కూతుర్ని ఎప్పుడడిగితే అప్పుడు పంపిస్తాడు"

"....అదే రేపు తను రెండో పాప స్వరూపకు పెళ్ళిచేస్తే అల్లుడు మంచివాడు కాకపోతే తన కూతుర్ని తననుండి వేరుచేస్తే.... అదే సాంప్రదాయమని తను నిశ్శబ్దంగా వుండిపోవాల్సిందేనా?"

"ఏవిటే మాట్లాడవూ?"

"ఏమీ లేదులేమ్మా! నీమీద బెంగగా వుంది నాకు. ఒక సంవత్సరము నా దగ్గరుందువుగాని రా"

"సంవత్సరమే బాగుండదులే సమీరా"

"మీ అల్లుడు అలా అనుకునే రకం కాదులేమ్మా"

"ఆ పిల్లాడు అనుకోకపోయినా లోకం దృష్టిలో అది బావుండదు లేమ్మా"

ఒక్కసారిగా సంవత్సరం అని అనకుండాల్సింది అని అనుకుంది సమీర.

"పోనీ ఓ నెలరోజులు రామ్మా"

ఆ నెలరోజులలో నూతన్ మారతాడని సమీర ఆశ లేదా తల్లిని నెలనెలా అంటూ పొడిగించుకుంటూ తన దగ్గరే వుంచుకోవచ్చని నమ్మకము.

"అలాగేలే దిగులు పడకు. పెద్దదానికి పెళ్ళి చేసేస్తివి. యింక చిన్నదానికి పెళ్ళయిపోతే ఇంకెవరున్నారు? పాపం నీకు....చెపితే విన్నావు కాదు. కొడుకు పుట్టేదాకా ఆపరేషన్ చేయించుకోవద్దంటే"

స్వరూపకు పద్నాలుగేళ్ళు.

ఈ మాట పద్నాలుగు వందల సార్లయినా అనుంటుంది పార్వతమ్మ ఈ పద్నాలుగేళ్ళల్లో.

"ప్రతిసారీ కూతుళ్ళయితేనేం? కొడుకులు అయితేనేం? కొడుకే ఉద్ధరిస్తాడా? అని జవాబిచ్చేది సమీర అలాంటిది. ఈసారి ఏమీ మాట్లాల్లేదు. ఆమె రావటానికి ఒప్పుకుంది అంతే చాలు-పాపం జ్యోతి దిగులు పడిపోయింది. అమ్మకి చెపితే అర్థం చేసుకోదు-తను మాత్రం ఎన్నిసార్లు చెప్పలేదూ!"

"జ్యోతికి చెప్పొస్తాను రేపెళదామమ్మా స్వరూప ఒక్కటే చేసుకోలేదు పాపం"

"అలాగే నూతన్‌ని కూడా తీసుకెళదాం."

అదిరిపడ్డట్టు చూసింది సమీర. తర్వాత తేరుకుని అంది. "వాడొద్దులేమ్మా వాడి చదువు పాడయిపోతుంది"

"ఒక్కనెలకే వాడి చదువు పాడయిపోతుందా మరీ చోద్యం" ముక్కుమీద వేలేసుకుందామె. ఆమెకు నిజం తెల్సు. ఈ ఒక్క నెలలో వాడికి తను దూరమయిపోతుందని ఆమె భయం.

"అలా అనకమ్మా. నూతన్ మగబిడ్డ. చదువుకోకపోతే ఎలా?"

అలా అనేసి విభ్రాంతిలో మునిగిపోయింది సమీర.

'మగపిల్లాడు అనే ప్రత్యేక భావం తనలోనూ అంతర్లీనంగా వుందా?'

"అలాగేలే వస్తాను దిగులుపడకు, కానీ వాడు దిగులుపడతాడేమో పాపం."

తేరుకుంది సమీర.

"దిగులు పడడులేమ్మా. వాళ్ళమ్మ వాడికుంది. నువ్వే నా దగ్గరకు రానంటున్నావుగానీ" తల్లి రియాక్షన్ కోసం ఓరకంట చూసింది సమీర.

పార్వతమ్మ తన తప్పు తను తెలుసుకుంది. సమీర పాపం నొచ్చుకుంది అని అనుకుంది.

"నీదగ్గర వుండాలని నాకుమాత్రం వుండదా? కాకపోతే ఆడపిల్లవై పుట్టావు" నిట్టూరుస్తూ అంది పార్వతమ్మ.

సమీర మనస్సు ఆనందానికి, విచారానికి మధ్య వూగిసలాడింది.

* * * *

ఆ సాయంత్రం ఒంటరిగా డాబామీద కూర్చుంది సమీర. పార్వతమ్మ పనిలోవుంది జ్యోతిర్మయి అత్తగారి బట్టలు సూట్ కేస్‌లో సర్దుతోంది.

'ఏమిటిది? తన తల్లిని, తనని రేపొద్దున తనకూతురిని ఈ బేధ భావం వదలిపోదా?

మారామనుకుంటూనే మారని సాంప్రదాయాలతో రాజీ పడుతున్నామా?

ఉద్యోగం పురుష లక్షణం కావొచ్చు. అవసరయితే అది స్త్రీ లక్షణం కావాలి. దానికి చదువుకావాలి. ఇద్దర్నీ సమానంగా పెంచిన తల్లిదండ్రులకు కూతురింట్లో నాలుగునాళ్ళు వుండే హక్కు లేదా? ఇది అమ్మ అమాయకత్వమా?'

దానికి జవాబు ఇంటికెళ్ళాక సమీర భర్త చెప్పాడు.

"ఇన్ని శతాబ్దాలు గడిచినా ఈ సమాజం ఇంకా మారలేదు. నువ్వు నీ పెద్దకూతుర్ని అల్లుడు మనింటికి పంపిస్తున్నాడని సంతోష పడుతున్నావంటే పంపించాల్సిన బాధ్యత లేకపోయినా అతను పంపిస్తున్నాడని-అందువల్ల అతను మంచి అల్లుడు అయ్యాడుకదూ! నెలరోజులు నీ కూతురు, అల్లుడు పండక్కి వచ్చినప్పుడు నీ వియ్యపురాలు ఏమని ఫోన్ చేసింది.

"............"

"ఇన్ని రోజులు వుంచుకుంటే ఎలా? అని అవునా? అప్పుడేమన్నావు నువ్వు?"

"నిజమే పాపం నెలరోజులుంచుకున్నా ఆమె ఇన్నిరోజులు ఏమీ అనలేదని ఆమెమీద సానుభూతి చూపించావు అవునా?"

"అవును....ఏవిటో అలా అన్పించింది" అంది సమీర.

నవ్వాడు భరత్.

"అంటే....అంటే నువ్వింకా మారని ఈ సమాజంలో వున్నావు. ఈ సమాజం ఇంకా మారాలి. అప్పుడుకానీ ఆడపిల్లల్ని కన్నతండ్రులు పశ్చాత్తాపపడరు. మీ అమ్మ అన్నదాంట్లోనూ తప్పులేదు. మారని సమాజంలో నిలబడి ఆమె అంది. మగపిల్లాడు పుట్టందే ఆపరేషన్ చేయించుకోవద్దని."

"మరి మీరు ఆపరేషన్ నాకెందుకు చేయించారు?" దానికిజవాబు భరత్ దగ్గరుంది.

విపరీతమైన ఆకర్షణలున్న ఎలక్ట్రానిక్ యుగం ఇది.

ఇద్దరు పిల్లలకయ్యే ఖర్చులే భారమైన రోజులు ఇవి. లేకపోతే ఈ సమాజంలో వున్న భరత్ మగపిల్లాడు లేందే ఆపరేషన్ చేయించుకునేవాడు కాదు.

*